క్లుప్తంగా

గాలివాన బీభత్సం



గురజాల : గురజాల మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి వీచిన ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గాలుల దాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామ శివారులో 5 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ శాఖ అధికారులు పెట్రోలింగ్ చేసి వాటి స్థానంలో మరొక స్తంభాలను ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమైయ్యారు. అదే విధంగా చర్లగుడిపాడు గ్రామంలో వేంచేసియున్న మల్లిఖార్జున స్వామి వారి దేవస్థానంలో స్తంభం నేలకొరిగింది. శుక్రవారం రాత్రి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో వృద్ధులు, చిన్నారులు, తీవ్ర ఇబ్బందులు ఏదుర్కొన్నారు. శనివాసం తెల్లవారుజామున 1.30 నిమిషాలకు విద్యుత్ సరఫరా చేయడంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

వ్యర్థాలను వృథా చేయొద్దు



దాచేపల్లి: వ్యర్థాలు వృథా చేయవొద్దని నగర పంచాయతీ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య అన్నారు. నగరపంచాయతీ పరిధిలో వ్యర్ధ పదార్థాల సేకరణ కోసం ప్రత్యేక డ్రైవ్ శనివారం నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది, డ్వాక్రా ఆర్పీల ద్వారా వ్యర్థాలను సేకరించారు. ఈసందర్భంగా శ్రీవిద్య మాట్లాడుతూ వ్యర్థాలు ఎక్కడంటే అక్కడ వేయడం వల్ల పర్యావరణం కలుషితమవుతోందని, పర్యావరణాన్ని పరిరక్షించకపోతే మనిషి మనుగడ ప్రమాదకరంగా ఉంటుందన్నారు. ఇంట్లో నిరుపయోగంగా ఉండే వ్యర్థాలు ఎక్కడంటే అక్కడ వేయవద్దని, నగర పంచాయతీ ఏర్పాటు చేసిన డస్టబిన్‌లలో మాత్రమే వేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో నగరపంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, వైస్ చైర్మన్‌లు షేక్ ఖాదర్‌బాషా, కె.విజయకుమార్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ



దాచేపల్లి: సబ్సిడీపై రైతులకు జీలుగు, మినుము, పిల్లిపెసర విత్తనాలు అందిస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి పాపకుమారి అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులకు సబ్సిడీపై జీలుగ, పిల్లిపెసర, మినుము విత్తనాలు శనివారం పంపిణీ చేశారు. 50 శాతం సబ్సిడీతో ఈవిత్తనాలు అందిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. పదికేజీల జీలుగ బ్యాగు రూ. 395లు, పదికేజీల జనుము బ్యాగు రూ. 420లు, 8 కేజీల పిల్లిపెసర బ్యాగు రూ. 388లు చొప్పున అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

చింతలతండాలో ఎస్ఐ ఆధ్వర్యంలో పల్లె నిద్ర



విజయపురిసౌత్: జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశాలతో శనివారం రాత్రి మాచర్ల మండలం చింతలతండా గ్రామంలో విజయపురిసౌత్ ఎస్ఐ పి అనిల్‌కుమార్‌రెడ్డి పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా మెలగాలన్నారు. ఘర్షణలకు పాల్పడకుండా స్నేహభావంతో ఉండాలని కోరారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మస్తాన్‌వలి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పిడుగురాళ్ల: ఆంధ్రప్రదేశ్ సంక్షేమ బాలికల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఖాళీలు భర్తీ చేయటకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సీహెచ్. వనజ తెలియజేశారు. 5వ తరగతిలో ఎస్టీ 10, 6వ తరగతిలో ఎస్టీ 15 ఖాళీలు ఉన్నట్లు తెలియజేశారు. దరఖాస్తులను ఈ నెల 30 వరకు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు : 9963752436, 9441921023 నెంబర్లను సంప్రదించాలని ఆమె తెలియజేశారు.

అపరిచిత వ్యక్తుల సమాచారం అందించాలి

చిలకలూరిపేటటౌన్: అపరచిత వ్యక్తులు సంచరించినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని రూరల్ ఎస్ఐ ఎస్.రాజేష్ చెప్పారు. శనివారం మండలంలోని బొప్పూడి గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సమీపంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు.

పల్నాడు అభివృద్ధిలో కాసు మార్కు

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- త్వరలో బీసీ భవనం, జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేస్తాం



కాసు బ్రహ్మనందరెడ్డి విగ్రహానికి నివాళి అర్పించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: దివంగత నేత కాసు బ్రహ్మానందరెడ్డి తీసుకొని వచ్చిన జీఓ కాపీ ఎంతో మంది బీసీ కులాల్లో వెలుగులు నింపిందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణ శివారులో కొండమోడులో కాసు బ్రహ్మానందరెడ్డి 29వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కొండమోడు జంక్షన్‌లోని కాసు బ్రహ్మానందరెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కాసు వెంగళరెడ్డి విగ్రహాలకు పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి బీసీ సంఘాల నేత కుందుర్తి గురవాచారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబంలో పుట్టి ప్రజాస్వామ్యంలో ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో అప్పుడు ప్రకాశం పంతులుగారు జిల్లాల్లో సమర్దవంతమైన నాయకులు కావాలని, పల్నాడు నుంచి మరీ రాణించే నాయకులు కావాలని కాసు కుటుంబాన్ని వెంకటరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వెంగళరెడ్డి ప్రోత్సహించారు. 1930 కాసు వెంకటరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి అకస్మాత్తుగా ఆయన మరణించడం, బ్రాహ్మానందరెడ్డి బ్రిటిష్ కాలంలోనే శాసన సభకు ఎన్నికయ్యారు. ఆర్థిక మంత్రిగా, 1964లో కాసు బ్రహ్మానందరెడ్డిని ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారు. పండింట్ జోవహర్ లాల్ నెహ్రూ నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు పునాది రాయి వేయడం, ఆర్థిక పరిస్థితుల వల్ల అది నత్తనడకన సాగడంతో కాసు బ్రహ్మానందరెడ్డి పట్టుబట్టి నిధులు కేటాయించి నాగార్జునసాగర్ పూర్తి అయ్యేలా చేశారు. బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తే బాగుటుందని రిజర్వేషన్ తీసుకొని రావడం కోసం కమిటీ ఏర్పాటు చేసి చట్టబద్దత తీసుకుని వచ్చి 92 కులాలకు రిజర్వేషన్ తీసుకొని వచ్చారన్నారు. తెలుగు దేశం పార్టీ నాయకులు 92 కులాలకు బీసీ రిజర్వేషన్ కల్పించారని బీసీడే చేసుకుంటుంటే దానిని రాజకీయం చేస్తున్నారని, తెలుగు దేశం పార్టీలో పల్నాడు ప్రాంతంలో ఏ నాయకుడికైనా ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చారని ప్రశ్నించారన్నారు. ఇప్పటికి పల్నాడు ప్రాంతం నుంచి ఇద్దరు బీసీ నాయకలుకు ఎమ్మెల్సీ కేటాయించారని, అంతేకాకుండా ఇద్దరు బీసీ నాయకులకు ఎమ్మెల్యేలుగా టిక్కెట్లు కేటాయించి గెలిపించుకున్నారన్నారు. ఇప్పటికైనా మాచర్ల, గురజాల నియోజకవర్గంలో ఒక్క బీసీనైనా నిలబెట్టి గెలిపించుకునే ధుమ్ము ఉందా అని ప్రశ్నించారు. 40 ఏళ్లల్లో బీసీలకు ఎందుకు సీట్లు కేటాయించలేదని ప్రశ్నించలేకపోతున్నారన్నారు. కాసు బ్రహ్మనందరెడ్డి దూదేకు సాహెబ్‌లకు రిజర్వేషన్ కల్పిస్తే రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. దాచేపల్లి పట్టణంలో జ్యోతిరావుపూలే విగ్రహాన్ని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్సీ కాసు మహేష్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించుకున్నామని, మరో రెండు నెలల్లో పిడుగురాళ్ల నడిబొడ్డులో జ్యోతిరావుపూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయబోతున్నామని, అలాగే బీసీ భవనంను కూడా త్వరలోనే నిధులు సమకూర్చుకొని ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు చింతా వెంకట రామారావు, చల్లా పిచ్చిరెడ్డి, మున్సిపల్ చైర్మన్‌కొత్త వెంకట సుబ్బారావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, కుందుర్తి గురవాచారి, కందులూరి శివయ్య, మందా సుధీర్, అల్లు పిచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వీరభద్రునిరామిరెడ్డి, మాచవరం మండల కన్వినర్ చౌందరి సింగరయ్య, శెట్టుపల్లి పూర్ణ, షేక్ మస్తాన్‌వలి, గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, కేవీ, ఆంధ్రయ్య, పోలు వీరారెడ్డి, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు బచ్చే మేస్త్రీ, జెడ్పీటీసీ మూలగుండ్ల ప్రకాష్‌రెడ్డి, తాటికొండ చిన్న ఆంజనేయులురెడ్డి, బాలస్వామి, పవన్‌రెడ్డి, మద్దు ప్రసాద్, లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కాసు బ్రహ్మానందరెడ్డికి ఘన నివాళి

గురజాల : బీసీల అభ్యున్నతికి కృషిచేసిన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి అని జెడ్పీటీసీ ఆరికట్ల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి అన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద కాసు బ్రహ్మానందరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, ఎంపీపీలు మాట్లాడుతూ కాసు బ్రహ్మానందరెడ్డి హయాంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాయన్నారు. అదే విదంగా కాసు బ్రహ్మనందారెడ్డి వర్ధంతిని బీసీడేగా జరుపుకునే విదంగా రాష్ట్రప్రభుత్వం జీవోను విడుదల చేయాలన్నారు. అనంతరం పిడుగురాళ్లలో జరిగిన వర్థంతి వేడుకలకు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవి), బత్తుల తిమ్మరాజు, కటికల శిల్వరాజు, కందిమళ్ల శ్రీనివాసరావు, గాడిపర్తి వెంకటేశ్వర్లు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని ప్రతి ఒక్కరు పరిరక్షించాలి

మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వెంకట సుబ్బారావు

పిడుగురాళ్ల: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్య ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద పర్యావరణ దినోత్సవం సందర్భంగా మేరా లైఫ్, మేరా స్వేచ్ఛ, ఆర్.ఆర్.ఆర్. పోగ్రాంని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పర్యావరణంలో భాగస్వాములమేనని, దానిని మనం పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పర్యావరణంలో మనం ఉపయోగించుకున్న వస్తువులను రీసైక్లింగ్ చేసుకునే విధంగా చూడాలని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కొమ్ము ముక్కంటి, షేక్ జైలాబ్దిన్, కమీషనర్ ఎ. వెంకటేశ్వర్లు, మున్సిపల్ కౌన్సిలర్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తదితరులు ఉన్నారు.

యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాల కల్పనకు చర్యలు



మాట్లాడుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి కిరణ్ నాయక్, ఈఓఆర్డీ సత్యప్రసాద్

కారెంపూడి : మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం గ్రామ సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ వద్ద తమ వివరాలు నమోదు చేయించుకోవాలని, పేర్లు నమోదు చేయించుకున్న యువతకు వారికి నచ్చిన రంగాల్లో తగిన శిక్షణ ఇచ్చి ప్రభుత్వమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందని ఈఓఆర్డీ పి సత్యప్రసాద్ తెలిపారు. ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులతో ఈ విషయమై ఈఓఆర్డీ శనివారం సమావేశం నిర్వహించారు. స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి కిరణ్‌నాయక్ ఇందుకు అవసరమైన యాప్‌లను పంచాయతీ కార్యదర్శుల సెల్‌ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేశారు. గ్రామ కార్యదర్శులు గ్రామ సభలు నిర్వహించి పదవ తరగతి ఆపై చదువుకున్న నిరుద్యోగులను గుర్తించి వారు గ్రామ సచివాలయంలో ఉద్యోగాల కల్పనకు దరఖాస్తులు చేసుకునేలా ప్రోత్సహించాలని ఈఓఆర్డీ ఆదేశించారు. వచ్చే నెల ఐదవ తేదీ లోపు నిరుద్యోగ యువత పేర్లు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆ తర్వాత వారికి ప్రభుత్వమే శిక్షణ ఇచ్చి డేటాఎంట్రీ ఆపరేటర్లుగా ఇతర రంగాల్లో ఉద్యోగాలు కల్పిస్తోందని చెప్పారు. రెండో అంశంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని గ్రామాల్లో పటిష్ఠంగా అమలు చేయాలని, బహిరంగ మల విసర్జనను జరగకుండా గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వీధుల్లో వ్యర్థాలను ఎప్పటికప్పుడు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లకు చేరేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ప్రజలు కూడా స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి సహకరించాలని ప్లాస్టిక్ వినియోగాన్ని నిలిపివేయాలని వ్యర్థాలను డ్రైనేజీల్లో వేసే బాధ్యతారాహిత్యానికి పాల్పడవద్దని ఈఓఆర్డీ కోరారు. సమావేశంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి



ఆకు కూరల సాగును పరిశీలిస్తున్న అధికారి

వినుకొండ(నూజెండ్ల): ప్రతి రైతు మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి అన్నారు. మండలంలోని ఏనుగుపాలెం గ్రామంలో శనివారం ఖరీఫ్ సాగుకు సమాయత్తం కార్యక్రమం నిర్వహించారు. బెండ, వంగ, డ్రాగన్ ఫ్రూట్, ఆకుకూరలు సాగు చేసిన పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, డీపీఎం అమలకుమారి పరిశీలించారు. అనంతరం సచివాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. మురళి మాట్లాడుతూ మట్టి నమూనాలు చేయించుకోవడం ద్వారా రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. కౌలు రైతులు కార్డులు తీసుకోవాలని సూచించారు. పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో అందిస్తున్న సేవలను రైతులు వినియోగించుకోవాలన్నారు. డీపీఎం అమలకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి ఉన్న రైతులు గ్రామంలోని జడ్పీఎన్‌ఎఫ్ సిబ్బంది ద్వారా నేర్చుకొని సాగు చేయాల్సిందిగా సూచించారు. ఏడీఏలు సీహెచ్.రవికుమార్, బి.రవిబాబులు మాట్లాడుతూ పురుగుమందులు లేని కాలుష్య రహిత ఆహారాన్ని ప్రకృతి వ్యవసాయం ద్వారా పొందవచ్చని తెలిపారు. అనంతరం జీలుగ 50 శాతం రాయితీపై, పీఎండీఎస్ కిట్స్ 10మంది రైతులకు పంపిణీ చేశారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏవోలు కె.అంజిరెడ్డి, ఆర్.రామారావు, వినుకొండ మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాజేశ్వరరావు, మండలంలోని అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలను ఉపయోగించుకోవాలి

నాదెండ్ల: వేసవి సెలవుల్లో విజ్ఞాన శిబిరాలకు వచ్చి మంచి పుస్తకాల అధ్యయనంతో జ్ఞానసంపన్నులు కావాలని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్లలోని గ్రంథాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. వేసవిలో జరుగుతున్న విజ్ఞాన శిబిరాలకు హాజరౌతున్న విద్యార్థుల వివరాలు, వారికి శిక్షణనిస్తున అంశాలు తదితరాలపై అడిగి తెలుకున్నారు. చిన్నారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుస్తక పఠనంతో ఎంతో గొప్ప జ్ఞానం వస్తుందన్నారు. చదువుతో పాటూ ఆటపాటల్లో భాగస్వాములు కావటం ద్వారా ఉన్నత వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి విశేష ప్రాధాన్యతనిస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రావూరి శ్రీనివాసరావు ఉన్నారు.

పాత వస్తువులు అందజేయాలి

చిలకలూరిపేటటౌన్: ఇండ్లలో వాడుకోని వస్తువులను వేరే వ్యక్తుల ప్రయోజనం కోసం అందించాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. శనివారం పట్టణంలోని ఫైర్‌స్టేషన్ సమీపంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో రెడ్యూస్ రీ యూజ్ రీ సైకిల్ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రజలు పాత బొమ్మలు, ప్లాస్టిక్ వస్తువులు, పాత బట్టలు, పుస్తకాలు, పాత పాదరక్షలను పట్టణంలోని వివిధ వార్డుల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో అందజేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డీఈఈ తోట వెంకటరమణ, శానిటరీ ఇన్స్పెక్టర్లు షేక్ ఇస్మాయిల్, ఎ శ్రీనివాస్ పాల్గొన్నారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



ప్రసవం అనంతరం బిడ్డతో ఈఎంటీ సురేష్

కారెంపూడి : 108లో ప్రసవం జరిగి తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్న ఘటన గుళ్లపల్లి గ్రామ సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. కారెంపూడి శివారు కారెంపూడి తండాకు చెందిన జ్యోతి పురిటి నొప్పులతో బాధపడుతుంటే 108లో నర్సరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నకరికల్లు మండలం గుళ్లపల్లి గ్రామ సమీపంలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో వాహనం రోడ్డు పక్కనే నిలిపి 108 సిబ్బంది కాన్పు చేయించారు. ప్రసవం అనంతరం తల్లీబిడ్డను నర్సరావుపేట ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని ఈఎంటీ బత్తుల సురేష్, పైలెట్ జరపల సుందర్‌సింగ్‌నాయక్ తెలిపారు. రెండవ కాన్పులో జ్యోతి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం ఇబ్బంది లేకుండా జరగదంతో కుటుంబ సభ్యులు బంధువులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్ యార్డుతో రైతులకు మేలు జరుగుతోంది



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ఆంధ్రయ్య

దాచేపల్లి: వ్యవసాయ మార్కెట్ యార్డు ద్వారా రైతులకు అండగా ఉంటామని, రైతులకు మేలు చేసేలా పనిచేస్తున్నామని మార్కెట్ యార్డు చైర్మన్ కలకండ ఆంధ్రయ్య అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో యార్డు పాలక మండలి సభ్యుల సమావేశం శనివారం జరిగింది. పలు అంశాలపై సభ్యులతో చర్చించారు. వేసవి కాలం దృష్టిలో పెట్టుకుని ఈనెల 21 నుంచి 31 వరకు యార్డుకు సెలవులు ఇచ్చేందుకు తీర్మానం చేశారు. ఈసందర్భంగా చైర్మన్ ఆంధ్రయ్య మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ యార్డు ద్వారా రైతులకు అన్ని విధాలుగా తాము అండగా ఉంటామన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో కోల్డ్‌స్టోరేజీ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మిర్చి కొనుగోలు కేంద్రంలో రైతులు మిర్చి తీసుకొచ్చి క్రయ, విక్రయాలు జరుపుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో యార్డు వైస్ చైర్మన్ పెదపిచ్చయ్య, యార్డు కార్యదర్శి శ్రీనివాసరావు, యార్డు డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి వినోద కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఉమ్మడి దేవానంద్

చిలకలూరిపేటటౌన్: విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వేసవి వినోదం శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ చెప్పారు. శనివారం పట్టణంలోని శాఖ గ్రంథాలయాన్ని సందర్శించిన ఆయన గత ఐదు రోజుల నుంచి నిర్వహిస్తున్న వేసవి వినోదం శిక్షణా శిబిరాన్ని సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను ఉద యం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే శిక్షణ శిబిరానికి హాజరయ్యేలా చూడా లని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లా డి శిబిరం ద్వారా నేర్చుకున్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయానికి ఎక్కువ మంది సందర్శకులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రంథాలయ ఇన్‌చార్జి అధికారి నాగుల్ మీరావలి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి దార్ల బుజ్జిబాబు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఐ సుధాకర్

శావల్యాపురం: గ్రామాల్లోని ప్రజలందరూ చట్టాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ అన్నారు. మండలంలోని పిచకలపాలెం గ్రామంలో ప్రధాన కూడలి మార్గంలో ఎస్పీ ఆదేశాలు మేరకు పల్లె నిద్ర కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఈసందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ పేకాట, అసాంఘిక కార్యాకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. గ్రామాల్లో జరుగుతున్న వాటిపై పోలీసులు దృష్టి సాలించి సమస్యలు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలందరు ఉండాలనే ఉద్దేశ్యంతో పల్లెనిద్ర కార్యక్రమం దోహదపడుతుందన్నారు.

హెచ్ఐవీ బాధితులను ప్రేమతో ఆదరించాలి

ప్రపంచ దీప స్మృత్యంజలి సందర్భంగా పట్టణంలో నేడు ర్యాలీ

నరసరావుపేట: సమాజంలో హెచ్ఐవీ బాధితులను ప్రేమతో ఆదరించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి అన్నారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఏడాది మే మూడో ఆదివారం ఎయిడ్స్‌తో చనిపోయిన వారిని గుర్తు చేసుకుంటూ నిర్వహించే ప్రపంచ దీప స్మృత్యంజలిలో భాగంగా ఆదివారం సాయంత్రం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలో జిల్లా కలెక్టర్ పాల్గొంటారన్నారు. పూర్వం ఈ వ్యాధి గురించి అవగాహన లేక చనిపోయిన వారి కుటుంబాలు నేడు సమాజంలో ఆర్థికంగా ఎన్నో బాధలు అనుభవిస్తున్నాయన్నారు. ఈ వ్యాధి బారిన పడిన వారిని మనం ప్రేమతో ఆదరించి మనోధైర్యం నింపాల్సిన అవసరం ఉందన్నారు. పల్నాడు జిల్లాలో 9537 మంది సక్రమంగా మందులు వాడుతున్నారన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో హెచ్ఐవీ టెస్టులు ఉచితంగా చేస్తున్నారని, మూడు నెలలపాటు నిరంతరంగా జ్వరం వస్తూ పోతూ ఉండటం ఈ వ్యాధికి ఒక లక్షణమని, మరో లక్షణం బరువు తగ్గిపోతుండటం, మూడోది డయేరియా ఉన్నా పరీక్షలు చేయించుకోవాలన్నారు.

25న జాబ్‌మేళా

ఈపూరు: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో గుంటూరులోని ఏటీ అగ్రహారంలోని పోలేరమ్మ కల్యాణ మండపం ఆవరణలో ఈ నెల 25వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు శనివారం తెలిపారు. ఎంఎస్ఎన్ లాబొరేటరీస్ ఫార్మా కంపెనీలో టెక్నికల్ ట్రైనీలుగా పనిచేయుటకు ఇంటర్‌మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ నందు 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన 17– 20 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు జాబ్‌మేళాలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రాతపరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఉద్యోగంతో పాటు బీఎస్సీ, డిగ్రీ ఫార్మాస్యూటికల్ సైన్స్ కోర్సులను ఎంఎస్ఎన్ లాబొరేటరీస్ సౌజన్యంతో ఉచితంగా చదివించడం జరుగుతుందని వివరించారు. ఆసక్తి గల యువతీయువకులు విద్యార్హత సర్టిఫికెట్లు నకలు, రేషన్‌కార్డు జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో ఈ నెల 25వ తేదీ ఉదయం 10గంటలకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 6302096189, 0863–2950296 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఈపూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆసక్తిగల విద్యార్థులు జూన్ 7వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వల్లెపు శ్రీను శనివారం తెలిపారు. మోడల్ స్కూల్లో ఎంపీసీ, ఎంఈసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో ప్రవేశం ఉంటుందని, ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుందన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150లు ఫీజు చెల్లించాలన్నారు. మార్కులు, మెరిట్, రిజర్వేషన్ ప్రకారం ప్రవేశం కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు ఆదర్శ పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

నరసరావుపేట టౌన్: మైనర్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సిఐ అశోక్ కుమార్ శనివారం తెలిపారు. ప్రకాష్‌నగర్‌కు చెందిన బాలిక శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం దక్కలేదు. ఈ మేరకు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే జీవీపై కేసు నమోదు

వినుకొండ(నూజెండ్ల): జిల్లా టీడీపీ అధ్యక్షుడు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుపై శావల్యాపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇటీవల నారా లోకేష్ యువగళం పాదయాత్ర 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఎలాంటి అనుమతులు లేకుండా జాతీయ రహదారిపై ర్యాలీ చేయడం, బహిరంగ సభ నిర్వహించడమే కాకుండా రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించడంతో జాతీయరహదారిపై 4 గంటలు ట్రాఫిక్ జామ్ అయింది. నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించడంపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు శావల్యాపురం ఎస్ఐ గల్లా రవికుమార్ తెలిపారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించుకోవాలి

జిల్లా ఇన్‌స్పెక్టర్ కరిముల్లా బాషా

నాదెండ్ల: వక్ఫ్ బోర్డ్ ఆస్తులను పరిరక్షించుకోవాలని, అందుకు ఆస్తులను వక్ఫ్‌బోర్డ్ కార్యాలయంలో రిజిష్టరు చేయించుకోవాలని జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఇన్‌స్పెక్టర్ షేక్ కరిముల్లా బాషా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లిం పెద్దలు, ముతవల్లిలు, ధర్మకర్తలు, కమిటీ ప్రెసిడెంట్లు, కమిటీ సభ్యులకు రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ స్పెషలాఫీసర్ పలు సూచనలు చేసినట్లు చెప్పారు. మసీదు, దర్గాలు, ఈద్గాలు, పీర్ల చావిడీ, పీర్ల పంజాలు, అషుర్‌ఖానా, ముసాఫిర్ ఖానాలు, తకియా, ముస్లిం శ్మశాన వాటికలు, చిల్లాలు, జెండా చెట్లు మొదలగువన్నీ వక్ఫ్ బోర్డు పరిధిలోకి వస్తాయన్నారు. పైన తెలిపిన ఆస్తులన్నీ ముందుగా జిల్లా కార్యాలయంలో రిజిస్టరు చేయించుకోవాలన్నారు. వక్ఫ్‌బోర్డు జాబితాలో పరిశీలించుకోవాలన్నారు. వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమైతే వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో గానీ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గానీ ఫిర్యాదు చేయాలన్నారు. వివరాలకు వక్ఫ్ బోర్డ్ జిల్లా ఇన్‌స్పెక్టర్ షేక్ కరిముల్లాబాషా 8978858114 నంబరులో సంప్రదించాలన్నారు.

విద్యుదాఘాతంతో నివాసం దగ్ధం

వినుకొండటౌన్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని ఇంట్లో అగ్నిప్రమాదం చోటు చేసుకొని రూ. 1.90 లక్షల ఆస్తినష్టం సంభవించింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కోటా సతీష్ కుమార్‌కు చెందిన ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించి ఇంట్లోని ఎలక్ట్రికల్ వస్తువులు, గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సకాంలో స్పందించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో రూ.1.90 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి అధికారి ఎం. శ్రీనివాసరావు తెలిపారు.